క్లుప్తంగా

రెవెన్యూ సమస్యలను వెంటనే పరిష్కరించాలి



అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీఓ సుజన

కార్వేటినగరం: రెవెన్యూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని నగరి ఆర్డీఓ సుజన అన్నారు. శనివారం ఆమె స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ శ్మశాన వాటికలు లేని గ్రామాలను గుర్తించి వెంటనే శ్మశాన వాటికలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా వివాహాలు అయిన కుటుంబాలను గుర్తించి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలన్నారు. అలాగే భూముల రీసర్వే వేగవంతంగా పూర్తి వేయాలని సూచించారు. ధ్రువపత్రాల మంజూరులో జాప్యం లేకుండ చూడాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ పుల్లారెడ్డి, డీటీ లక్ష్మీపతి, మండల సర్వేయర్ సురేష్, ఆర్ఐలు, వీఆర్వోలు పాల్గొన్నారు.

మునిరత్నం సేవలు మరువలేనివి



ఆహార పొట్లాలు అందిస్తున్న రాస్ సిబ్బంది

పుత్తూరు రూరల్: రాష్ట్రీయ సేవా సమితి(రాస్) ప్రధాన కార్యదర్శిగా గుత్తా మునిరత్నం అందించిన సేవలు మరువలేనివని రాస్ పుత్తూరు శాఖ అధికారి కె.రవి అన్నారు. శనివారం గుత్తా మునిరత్నం ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకుని కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలోని 150 మంది పేదలకు ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది అన్బలగన్, కమల, తేజు, బాబునాయుడు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



శ్రీవిద్య మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న నేతలు

వడమాలపేట : మండల పరిధిలోని ఏఎం పురం ఎస్టీ కాలనీకి చెందిన శ్రీవిద్య, ఎర్రబ్బ రామచంద్రాపురం మండలం నెత్తకుప్పం నుంచి ట్రాక్టర్‌లో వస్తుండగా బోల్తా పడి మృతి చెందారు. విషయం తెలిసి జెడ్పీటీసీ మాజీ సభ్యులు, సచివాలయాల కన్వీనర్ సురేష్‌రాజు, వడమాలపేట సింగిల్‌విండో డైరెక్టర్ సుబ్రమణ్యంరాజు మృతుల కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం, పార్టీ తరపున శ్రీవిద్య, ఎర్రబ్బను ఆదుకుంటామని వారి కుటుంబసభ్యులకు భరోసా ఇచ్చారు.

సారా ఊట ధ్వంసం



నిందితుడి అరెస్ట్ చూపుతున్న డీటీఎఫ్ బృందం

పుత్తూరురూరల్: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు, తిరుపతి డీటీఎఫ్ బృందంతో కలిసి శనివారం నిర్వహించిన దాడుల్లో ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి వంద లీటర్ల సారా ఊటను ధ్వంసం చేసినట్లు సీఐ కృష్ణ తెలిపారు. పుత్తూరు మండలం చౌటూరు గ్రామ సమీపంలోని ఏటికాల్వపై సి.కాశీ(38) అనే వ్యక్తిని అరెస్ట్ చేసి విచారించగా, ముళ్లపొదల్లో సిద్ధం చేసి ఉంచిన సారా ఊటను ధ్వంసం చేశామన్నారు. అరెస్ట్ అయిన వ్యక్తి ఇదివరకే మరో కేసులో నిందితుడిగా ఉన్నాడని చెప్పారు. ఆ కేసు విచారణలో ఉండగానే మరోసారి నేరం చేస్తూ పట్టుబడినట్లు వివరించారు. దాడుల్లో డీటీఎఫ్ సీఐ హేమంత్‌కుమార్, ఎస్ఐ నరసింహులు, పుత్తూరు ఎస్ఐ నాగరాజు సిబ్బంది పాల్గొన్నారు.

సకాలంలో బిల్లులు చెల్లించాలి



జైన్ ఫ్యాక్టరీ వద్ద నిరసన తెలుపుతున్న మామిడి రైతులు, రైతువిభాగం నాయకులు

గంగాధరనెల్లూరు(కార్వేటినగరం) : మామిడి రైతులకు గిట్టుబాటు ధరతో కూడిన బిల్లులను సకాలంలో చెల్లించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు కామసాని వెంకటరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని జైన్ ఫ్యాక్టరీ ఆవరణలో మామిడి రైతులు, రైతు సంఘం నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు వెంకటరెడ్డి మాట్లాడుతూ మామిడి కాయలను రవాణా చేసే డ్రైవర్లకు, వసతి, భోజన సౌకర్యాలు కల్పించాలని, బిల్లులు ఆలస్యం అయినప్పుడు టన్నుకు రూ.3 నుంచి 5 వేల వరకు అదనంగా చెల్లించాలని యాజమాన్యం షమీర్‌శర్మను డిమాండ్ చేశామని వివరించారు. ఇప్పటికైనా మామిడి రైతులకు సకాలంలో బిల్లులు చెల్లించి న్యాయం చేయాలని, అలాగే ఈ ఏడాది మామిడి రైతులు నష్టపోకుండా చూడాల్సిన అవసరం యాజమాన్యానికి ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర డైరెక్టర్ గుణశేఖర్‌రెడ్డి, రైతునాయకులు ఉమాశంకర్‌రెడ్డి, పురుషోత్తం, త్యాగరాజులురెడ్డి, ఏకాంబరం, పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- రోడ్ల డెవలప్‌మెంట్‌కు ప్రత్యేక చర్యలు
- సీఎం జగనన్న పాలనలోనే రాష్ట్రాభివృద్ధి
- అత్తూరులో రూ.17.50 లక్షలతో రోడ్డు, కల్వర్టు నిర్మాణం ప్రారంభం
- పర్యాటక శాఖ మంత్రి రోజా



అత్తూరులో రోడ్డు, కల్వర్టుకు సంబంధించిన శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి రోజా



మినీ గ్రానైట్ కంపెనీని ప్రారంభిస్తున్న మంత్రి రోజా

నింద్ర: గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగనన్న పాలన సాగిస్తున్నారని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి రోజా అన్నారు. శనివారం మండలంలోని అత్తూరు సచివాలయ పరిధిలో రూ.17.50 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణం, కల్వర్టు నిర్మాణాలు పూర్తి చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అత్తూరు సచివాలయ పరిధిలో అత్తూరు, ఊరూరుపేట రెండు పంచాయతీల్లో కలిపి రూ.1.60 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. గ్రామ సచివాలయ భవనంనికి రూ.40 లక్షలు, రైతుభరోసా కేంద్రానికి రూ.22 లక్షలు, బల్క్ మిల్క్ చిల్లింగ్ యూనిట్‌ను రూ.12 లక్షలతో నిర్మించామన్నారు.

గ్రామస్థాయిలోనే ప్రభుత్వ సేవలు అందించేలా జగనన్న పాలన అందిస్తున్నారని తెలిపారు. సచివాయల వ్యవస్థతో పల్లెల్లో ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కారం అవుతున్నాయని అన్నారు.

ఏ రోజైనా పేదలకు సాయం చేశావా బాబు..

గతంలో తానే ఢిల్లీలో చక్రం తిప్పానని.. తనంత గొప్పోడు లేడు అని చెప్పుకునే చంద్రబాబు.. ఏనాడైనా పేదలకు సాయం చేశావా ? అని మంత్రి రోజా ప్రశ్నించారు. పేదపిల్లల చదువుల కోసం అమ్మఒడి ఇచ్చావా..? ఎన్నడైనా ఫీజు రీయింబర్స్‌మెంట్ సరిగ్గా ఇచ్చావా.. ? అలాగే ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టాలని ఆలోచన చేశావా..? అని సూటిగా ప్రశ్నించారు. అనుభవం అంటే వయసుతో వచ్చేది కాదని, మంచి చేయాలన్న తలంపు ఉండాలన్నారు. అనుభవజ్ఞుడని 2014లో ప్రజలు చంద్రబాబును గెలిపిస్తే రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచేసి హైదారాబాద్‌లో వందల కోట్లతో ఇళ్లు నిర్మించుకున్నాడని ఆరోపించారు.

గ్రామస్థాయిలోనే ప్రభుత్వ సేవలు..

సీఎం జగనన్న రాష్ట్రంలోని పేదలకు సొంతింటి కల నెరవేర్చుతున్నాడని మంత్రి రోజా తెలిపారు. గ్రామస్థాయిలో హెల్త్ సెంటర్లు, మండల కేంద్రాల్లో 100 పడకల వైద్యాశాల, సచివాలయాలు, ఆర్బీకేలను ఏర్పాటు చేసి గ్రామస్థాయిలో ప్రభుత్వ సేవలు అందేలా చేశారని తెలిపారు. అనంతరం సచివాలయంలో మంత్రి అధికారులతో సమీక్షంచారు. కార్యక్రమంలో ఎంపీపీ దీప, వైస్ ఎంపీపీ దుర్గాదేవి, శుభ, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ వేణు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి శ్యామ్‌లాల్, సింగిల్‌విండో అధ్యక్షుడు మునికృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ రామచంద్రా రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు వేణురాజు, ఆర్‌బీకే చైర్మన్ వీరయ్య, నాయకులు దామురెడ్డి, రమేష్, రాధా రెడ్డి తదతరులు పాల్గొన్నారు.

మినీ గ్రానైట్స్ కంపెనీ ప్రారంభం..

మండల కేంద్రమైన నింద్ర పంచాయతీ మిట్టకండ్రిగ గ్రామం వద్ద శనివారం మినీ గ్రానైట్స్ కంపెనీని మంత్రి రోజా ప్రారంభించారు. అగరంపేట యువకులు నవీన్ స్వరాజ్ ఏర్పాటు చేసిన కంపెనీని ప్రారంభించిన ఆమె మాట్లాడుతూ చిన్న పరిశ్రమల ఏర్పాటుకు యువత ముందుకు రావాలన్నారు. అప్పుడే రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందని తెలిపారు.

జగనన్న పాలనలో ప్రజలకు భరోసా



పాలసముద్రం సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

పాలసముద్రం : రాష్ట్రంలో ప్రజాసంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వల్ల ప్రజలను బంగారు భవిష్యత్ ఉంటుందని డిప్యూటీ సీఎం, ఎక్సైజ్ శాఖ మంత్రి నారాయణస్వామి అన్నారు. శనివారం ఆయన పాలసముద్రం గ్రామ సచివాలయ పరిధిలోని పాలసముద్రం దళితవాడ, దీనబంధుపురం, ఆదిఆంధ్రవాడ, కుమ్మరిల్లు గ్రామంలో జెడ్పీటీసీ అన్బళగన్, మండల కన్వీనర్ తులసియాదవ్, సర్పంచ్ అయ్యప్ప, ఎంపీటీసీ గోవిందరాజు ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి, అధికారులు, పార్టీ నాయకులతో కలసి ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ఆరా తీశారు. అలాగే ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాలసముద్రం దళితవాడలో ఇంటిపట్టాలు, ఇళ్లు మంజూరు చేయాలని, డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయించాలని మంత్రిని కోరారు. వెంటనే ఆయన సంబంధిత అధికారులతో చర్చించి సమస్యలను పరిష్కరించాలని తెలిపారు.

ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు

ప్రజా సమస్యలను తెలుసుకోవడానికి 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను నియమించడంతో పాటు గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. పేద, బడుగు బలహీనవర్గాలకు అండగా ఉంటూ రైతన్నలకు అండగా నిలుస్తున్న పేదల పక్షపాత ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమని తెలిపారు. గ్రామాల్లో జగనన్న కాలనీల పేరుతో కొత్త గ్రామాలే వెలుస్తున్నాయని తెలిపారు. వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్, పుష్ప, మాజీ మండల అధ్యక్షురాలు ఇందిరమ్మ, రైతు భరోసా చైర్మన్ పోలయ్య, తహసీల్దార్ బాలు, ఎంపీడీఓ శ్రీనివాసన్, ఐకేపీ ఏపీఎం ఫరీద్‌మస్తాన్, హౌసింగ్ డీఈ వెంకటేశ్వర్లు, ఎంఈఓ రాజేంద్రప్రసాద్, ట్రాన్స్‌కో ఏడీ జ్ఞానేశ్వర్, ఎస్ఐ షెక్షావలి, సర్పంచులు గాలి మహేష్ బాబు, సుందరరాజు, సుబ్రమణ్యరెడ్డి, త్యాగరాజ్, అనందన్, ప్రకాష్, అరుల్, మురళి, వేణు, కేశవరెడ్డి, రవిరెడ్డి.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేరింది



సొంతిల్లు లేక చాలా ఇబ్బందులు పడ్డాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే సొంతింటి కల నెరవేరింది. సంక్షేమ పథకాలు నేరుగా మా ఇంటికే చేరుతుండంతో కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేదు. గ్రామాల్లోనే సచివాలయ సిబ్బంది అదుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తున్నారు. – శాంతి, పాలసముద్రం, గృహిణి

మా పెద్ద కొడుకు జగన్



మాకు కొడుకులు, కూతుర్లు ఉన్నా 1వ తేదీ తలుపు తట్టి పింఛన్ ఇస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నా పెద్దకొడుకు. గతంలో పింఛన్ ఎప్పుడు ఇస్తారో, ఎక్కడ ఇస్తారా ? పింఛన్ కోసం ఇబ్బంది పడేవాళ్లం. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. మేము ఆయనకు రుణపడి ఉంటాం. – అర్పుదం, పాలసముద్రం దళితవాడ

ప్రభుత్వ స్కూళ్లదే హవా

కార్వేటినగరం: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో ప్రభుత్వ స్కూళ్లదే హవా కొనసాగింది. శనివారం విడుదలైన ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ మార్కులతో ఆయా మండలాల్లో టాపర్లుగా నిలిచారు. అందులో పాలసముద్రం మండలంలో 70 శాతం ఉత్తీర్ణత సాధించగా, పెనుమూరు మండలంలో 68.8 శాతం, శ్రీరంగరాజపురం మండలంలో 93 శాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే కార్వేటినగరం మండలంలో 77.38 శాతం, గంగాధరనెల్లూరు మండలంలో 70 శాతం , వెదురుకుప్పంలో 63 శాతం ఉత్తీర్ణత సాధించడం జరిగింది. అందులో ప్రభుత్వ స్కూళ్లలో విద్యను అభ్యసించే విద్యార్థినులు కార్పొరేట్ స్కూల్ విద్యార్థుల కంటే అధిక మార్కులు సాధించి హవా చాటారు.

నగరి నియోజకవర్గంలోనూ అధిక ఉత్తీర్ణత

నగరి: నియోజకవర్గంలోని ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చూపారు. ముఖ్యంగా సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థినులు అధిక మార్కులు సాధించారు. నగరి మండలంలో 54.02 శాతం మంది, పుత్తూరులో 64 శాతం, నింద్రలో 65.5 శాతం, విజయపురంలో 62.08 శాతం , వడమాలపేట 78.5 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ స్కూళ్లలో ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా ఫలితాలు రావడంతో అన్ని వర్గాల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి.

మహిళలతో జాగ్రత్తగా మాట్లాడు భాను

- లేకుంటే తగిన రీతిలో బుద్ధి చెబుతాం
- వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఫైర్



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ హరి

పుత్తూరు రూరల్: మహిళల పట్ల మర్యాదగా మాట్లాడేది నేర్చుకోవాలని లేకుంటే తగిన రీతిలో బుద్ధి చెప్పాల్సి ఉంటుందని నగరి టీడీపీ ఇన్‌చార్జ్ గాలి భానుప్రకాష్‌పై పుత్తూరు మున్సిపల్ చైర్మన్ ఏ.హరి ఫైర్ అయ్యారు. శనివారం ఆయన పుత్తూరులో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలి భానుప్రకాష్ మహిళలను కించపరుస్తూ మాట్లాడడం, ప్రత్యర్థులను రాజకీయంగా ఎదుర్కోలేక వ్యక్తిగత దూషణలకు దిగడం, వారి వ్యాపారాలు, ఇళ్లపై దాడులు చేయించడం అతని నైజమని ఆరోపించారు. పుత్తూరులో ఆలయాల అభివృద్ధి అనేది మంత్రి ఆర్కే రోజా నేతృత్వంలోనే జరుగుతోందని తెలిపారు. నగరి నియోజకవర్గంలో సుమారు 8 వేలమంది పేదలకు ఇళ్లు కట్టిస్తున్న మంత్రిని విమర్శించే స్థాయి నీకు లేదన్నారు. కరోనా సమయంలో తన సొంత నిధులు రూ.1.50 కోట్లు ఖర్చు పెట్టి బాధితులను ఆదుకున్న మనసున్న మహిళ రోజమ్మ అని కొనియాడారు. అదే సమయంలో గాలిభాను హైదరాబాద్‌లో తలదాచుకుని, ఇప్పుడు అభివృద్ధి జరగలేదంటూ ఆరోపణలు చేస్తే ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని చెప్పారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో గాలి భానును మరోసారి చిత్తుగా ఓడించడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఈశ్వరాలయం చైర్మన్ రమేష్ బాబు మాట్లాడుతూ ఈశ్వరాలయం చుట్టూ మాడవీధులను ఏర్పాటు చేయడానికే ఆక్రమణలను తొలగించామని స్పష్టం చేశారు. ఇక్కడి నుంచి ఖాళీ చేయబడిన ఆరుగురిలో ఐదుగురికి జగనన్న ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని, మరొకరు ప్రభుత్వ ఉద్యోగి అన్న విషయాన్ని గుర్తించాలని వివరించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్, ఆలయ కమిటీ సభ్యులు బాబు, రమేష్, సుందరం, నాయకులు పాల్గొన్నారు.

డయేరియాపై అశ్రద్ధ వద్దు



ఆముదాలలో రికార్డులను పరిశీలిస్తున్న ఇమ్యునైజేషన్ ఆఫీసర్ రవిరాజు

పాలసముద్రం : అతిసారం(డయేరియా)పై అశ్రద్ధ వహించకుండా అవగాహన పెంచుకోవాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి రవిరాజు తెలిపారు. శనివారం ఆయన పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని. ఆముదాల ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఆయన సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాలకు కలుషితమైన నీటిని తాగడం వల్ల డయేరియాతో జీర్ణకోశ సంబంధిత వ్యాధుల బారిన పడే అవకాశం ఉందన్నారు. మురుగునీటి నిల్వలు, పరిసరాలను అపరిశుభ్రంగా ఉంచుకోవడంతో దోమలు వృద్ధి చెంది డెంగీ, చికెన్ గున్యా, మలేరియా, ఫైలేరియా తదితర వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. డయేరియా బారిన పడిన రోగులకు హెల్త్ క్లినిక్‌లు, సబ్ సెంటర్లలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. గ్రామాల్లో డయేరియా, మలేరియా, ఫైలేరియా, చికెన్ గున్యా, డెంగీ, తదితర కేసులను గుర్తించి వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. ఆముదాల ఆరోగ్య ఉపకేంద్రంలో చిన్నారులకు వేస్తున్న వ్యాధి నిరోధక టీకాల రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు మోహన్ కృష్ణ, సూపర్‌వైజర్ సుశీల, మురళి, సీహెచ్ఓ జ్ఞానశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు దుర్యోధన వధ

వెదురుకుప్పం: మండలంలోని మొరవ గ్రామంలో వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో జరుగుతున్న మహా భారత ఉత్సవాలలో భాగంగా ఆదివారం దుర్యోధన వధ ఘట్టాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భాగవతారిణి రత్నకుమారిచే హరికథా కాలక్షేపం జరిగింది. శుక్రవారం రాత్రి ఉత్తర గోగ్రహణంలో భాగంగా ఆవులను మళ్లించే కార్యక్రమం ఆకట్టుకుంది. వేణుగోపాలపురం గ్రామానికి చెందిన సర్పంచ్ భారతి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు.

ఘనంగా ప్రసన్న వేంకటేశ్వరస్వామి గ్రామోత్సవం



తిరుమాడ వీధుల్లో ఊరేగుతున్న ప్రసన్న వేంకటేశ్వర స్వామి

వడమాలపేట : మండలంలోని అప్పలాయగుంటలో వెలసిన టీటీడీ అనుబంధ ఆలయంలో కొలువైన శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వారి తిరుచ్చి గ్రామోత్సవం, ఊంజల్‌సేవ శనివారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి తోమాలసేవ, నిత్యకైంకర్యాలు చేపట్టారు. అనంతరం సర్వదర్శనానికి భక్తులను అనుమతించారు. సాయంత్రం ఉభయ నాంచారులతో ప్రసన్న వేంకటేశ్వర స్వామివారిని సర్వాభరణాలు, పూలమాలలతో ఊయల్లో అలంకరించి వేదమంత్రాలు, భక్తుల గోవిందనామస్మరణల నడుమ శ్రీవారికి ఊంజల్‌సేవ వేడుకగా నిర్వహించారు. అనంతరం సర్వ అలంకార భూషితుడైన పద్మావతి ఆండాల్ సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామిని మంగళవాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణలతో తిరుమాడవీధుల్లో ఊరేగించారు. భక్తుల నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు. రాత్రి స్వామివారికి ఏకాంతసేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమార ఆచార్యులు, ఆలయ టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివ కుమార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిఘా నేత్రం.. ఇల్లు భద్రం



కార్వేటినగరం పోలీస్‌స్టేషన్, (ఇన్‌సెట్) అందుబాటులో ఉంటున్న ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్

వేసవి సెలవులు మొదలయ్యాయి. సుమారు 40 రోజుల పాటు పిల్లలకు సెలవులు రావడంతో ఇళ్లకు తాళాలు వేసి కొందరు ఊర్లకు వెళ్తున్నారు. ఇదే అదునుగా దొంగలు రెచ్చిపోవడం తరుచుగా జరుగుతోంది. తాళం వేసిన ఇళ్లనే లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్నారు. ప్రతి వేసవిలో దొంగల బెడద పెరుగుతోంది. పోలీసులు గస్తీ కాస్తున్నా వారి కళ్లు కప్పి చోరీలకు పాల్పడుతూనే ఉన్నారు. ఇలాంటి సమస్యలకు పరిష్కారమే ఎల్‌హెచ్‌ఎస్(లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం)ఆధునిక సాంకేతికత ఆధారంగా రూపొందించిన ఈ యాప్‌తో చోరీలను అరికట్టడంలో ఎంతో ఉపకరిస్తోంది.

- ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌లో వివరాలు నమోదు చేసుకోండి
- చోరీలు జరగకుండా సాంకేతికతతో రక్షణ
- పైసా ఖర్చు లేకుండా పోలీసు సేవలు
- అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పోలీసుల సూచన

కార్వేటినగరం: వేసవి సెలవులకు ఊర్లకు వెళ్లే వారు ఇళ్లకు తాళాలు వేసి వెళ్తారు. దొంగలు కూడా తాళం వేసిన ఇళ్లనే టార్గెట్‌గా చేసుకుని చోరీలకు పాల్పడుతుంటారు. అయితే ఈ సమస్యలకు చెక్ పెట్టడానికి పోలీస్ యంత్రాంగం లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం యాప్‌ను ప్రవేశపెట్టింది. ముఖ్యంగా తాళం వేసిన ఇళ్లను ఈ యాప్ వెయ్యి కళ్లతో కాపలా కాస్తుంది. సెల్ ఫోన్ వినియోగదారులు ఈ ఎల్‌హెచ్‌ఎస్ యాప్‌ను డౌన్‌లోడు చేసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. కనీసం వేసవి సెలవుల్లో ఊర్లకు, టూర్లకు వెళ్లేవాళ్లు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే నిశ్చింతగా ఉండవచ్చని చెబుతున్నారు.

ఎంతమంది డౌన్‌లోడ్ చేసుకున్నారంటే..

చిత్తూరు జిల్లాలో 2017 జూన్‌లో ఈ యాప్ అందుబాటులోకి వచ్చింది. ఇప్పటికే ఈ యాప్ ద్వారా పోలీస్ సేవలు అనేకమంది పొందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఎల్‌హెచ్‌ఎంఎస్ అందిస్తున్నారు. ఇప్పటి వరకు 12 వేల మందికి పైగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. 238 మంది పోలీస్ వాచ్ రిక్వెస్ట్ పెట్టుకున్నారు. కొందరు ఇప్పటికే పోలీస్ వాచింగ్‌ను సద్వినియోగం చేసుకున్నారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్ ఏం చేస్తుంది..!

ఇది తాళం వేసిన ఇళ్లకు కాపలా కాస్తుందని చెప్పవచ్చు. దీనికి మనం ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు. ఒక్క పైసా ఖర్చు లేకుండానే మన ఇంటిపై పోలీసులు నిఘా పెడతారు. గుర్తు తెలియని వ్యక్తులు కానీ, దొంగలు కానీ ఇంట్లోకి ప్రవేశించడానికి ప్రయత్నిస్తే సెన్సార్ ద్వారా వారి ఫొటోలు తీస్తుంది. ఆగమేఘాల మీద పోలీస్ కంట్రోలు రూముకు, స్థానిక పోలీస్టేషన్ సిబ్బందికి అలారం ద్వారా సమాచారం ఇస్తుంది. పోలీసులను అప్రమత్తం చేస్తుంది. దీంతో నిమిషాల్లో పోలీసులు అక్కడికి చేరుకుంటారు. దొంగల చేతికి బేడీలు వేసి దొంగతనాలు జరగకుండా కాపాడుతారు. ఇంట్లో విలువైన వస్తువులు పోకుండా రక్షణ లభిస్తుంది.

పోలీసుల నిఘా షురూ..

ఎప్పుడైతే ఈ యాప్‌లో పోలీస్ వాచ్ అని రిక్వెస్ట్ పెట్టామో వెంటనే పోలీసులకు సమాచారం వెళ్తుంది. కంట్రోల్ రూం పోలీసులు, స్థానిక పోలీసులు రంగంలోకి దిగుతారు. రిక్వెస్ట్ పెట్టిన ఇంటి మీద రూటర్‌తో పాటు సెన్సార్‌తో పనిచేసే కెమెరాలను అమరుస్తారు. ఒకవేళ విద్యుత్ అంతరాయం కలిగినా సరే ఈ పరికరాలు సమర్థవంతంగా పని చేసేందుకు యూపీఎస్‌ను ఏర్పాటు చేస్తారు. దీన్ని పోలీస్ స్టేషన్ కంట్రోల్ రూములకు అనుసంధానం చేస్తారు. ఈ యాప్ ద్వారా సాంకేతికంగా పోలీసుల నిఘా కొనసాగుతుంది.

ఎలా డౌన్‌లోడ్ చేసుకోవాలి..!

గూగుల్ ప్లేస్టోర్‌లోకి వెళ్లి ఎల్‌హెచ్‌ఎంఎస్ ఏపీ పోలీసు అని యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి.అందులో మన ఫోన్ నంబర్, ఇంటి చిరునామాను రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అప్పుడు మనకు ఒక ఐడీ కేటాయిస్తారు. దీన్ని జాగ్రత్తగా భద్రపరుచుకోవాలి. ఎప్పుడైనా కొన్ని రోజుల పాటు ఊర్లు వెళ్లాలనుకున్నప్పుడు ఈ యాప్‌లోకి వెళ్లి యూజర్ ఐడీని నమోదు చేసుకోవాలి. మనం ఊరికి వెళ్లే రోజు తిరిగి వచ్చే రోజును ఎంటర్ చేయాలి. రిక్వెస్ట్ పోలీస్ వాచ్ అనే ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాలి.

సద్వినియోగం చేసుకోండి



వేసవిలో ఊళ్లకు వెళ్లేవాళ్లు ఈ ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ సేవలను సద్వినియోగం చేసుకోవడం మంచిది. తాళాలు వేసిన ఇళ్లల్లో దొంగలు పడకుండా ఇది రక్షణ కల్పిస్తుంది. అలాగే తమ వద్ద ఉన్న వెండి వస్తువులు, బంగారు నగలు, నగదును ప్రజలు జాగ్రత్తగా భద్రపరచుకోవాలి. వీలైనంత మేరకు వాటిని ఇళ్లల్లో ఉంచకుండా బ్యాంకు లాకర్లలో ఉంచడం మంచిది

– చంద్రశేఖర్, సీఐ, కార్వేటినగరం

కరివరదరాజ ఆలయంలో పౌర్ణమి పూజలు



కరివరదరాజ స్వామిని దర్శించుకుంటున్న మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి

నగరి : మున్సిపల్ పరిధిలోని సత్రవాడలో టీటీడీ పరిధిలో ఉన్న కరివరదరాజ స్వామి ఆలయంలో పౌర్ణమి పూజలు వైభవంగా నిర్వహించారు. మంత్రి ఆర్కేరోజా సోదరుడు రామ్ ప్రసాద్ రెడ్డి ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ప్రత్యేకంగా అలంకరించి మండపంలో ఉంచిన కరివరదరాజ స్వామిని దర్శించుకున్నారు. అధికారులు ఆయనకు ఆలయ మర్యాదలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, జిల్లా నేత అనుబంధ సంఘ అధ్యక్షుడు కన్నాయిరం, మున్సిపల్ పార్టీ కన్వీనర్ బీఆర్వీ అయ్యప్పన్, నాయకులు అయ్యప్పన్, జగన్, అరుణాచలం, మణివాసగం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూళ్లలోనే విద్యార్జన



నమోదు చేసుకున్న విద్యార్థులతో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు

నగరి : విద్యార్జన ప్రభుత్వ స్కూల్ నుంచే ప్రారంభం కావాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా ఉపాధ్యాయులు ప్రతి ఇంటికి వెళ్లి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పాలంటూ వారి తల్లిదండ్రులకు సూచిస్తున్నారు. ఇలా శనివారం రామ్‌నగర్-సీ ప్రాంతానికి చెందిన ఐదేళ్ల పైబడిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో నమోదు చేసుకున్నట్లు ప్రధానోపాధ్యాయులు కుప్పరాజు తెలిపారు. కార్యక్రమంలో సీఆర్పీ వాణి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.